బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి : టీజేఎస్



ఆర్. కృష్ణయ్యను సన్మానించి సంఘీభావం ప్రకటిస్తున్న మెరుగు శ్రీనివాస్, జశ్వంత్

చిక్కడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ జన సమితి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బీసీల న్యాయ సాధన దీక్షకు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ నుంచి పలువురు ర్యాలీగా ధర్నాచౌక్‌కు చేరుకుని దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆర్. కృష్ణయ్యను సన్మానించిన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ జశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గోల్నాక, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 30మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.12,05,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు మెరుగైన వైద్య చికిత్సలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో పొందగలుగుతున్నారని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని అర్హులైన వారందరికీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎం. అరుణ్‌కుమార్‌రెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి నెలకొంటుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం విద్యానగర్ శివంరోడ్‌లోని సత్యసాయిబాబా శతవార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో మొదటిసారిగా నిర్వహించిన అన్నదాన సేవా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

నాగరంజనికి తెన్నేటి లత పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్త్రీవాద రచయిత్రి డా. తెన్నేటి లత పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాన్ని మరో ప్రముఖ రచయిత్రి తెన్నేటి నాగరంజనికి ప్రదానం చేసే కార్యక్రమం వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శనివారం రాత్రి జరిగింది. తెలంగాణ భాషా, సాంస్కృతికశాఖ డైరెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పురస్కారాన్ని బహూకరించారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నిర్వాహకులు వంశీ రామరాజు, సుధాదేవి, శైలజ, సుధామయి తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చిక్కడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి యూనియన్‌బ్యాంక్‌లేన్‌లోని నల్లపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా నిర్వహించిన అన్నదానాన్ని ఆలయ నిర్వాహకుడు భవాని శ్రీనివాస్ ప్రారంభించారు. కాంగ్రెస్ నేత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్ట్ ఉదయ్‌భాస్కర్‌ను సన్మానిస్తున్న ఏసీపీలు రమేష్‌కుమార్, వెంకటేష్, నారగోని పురుషోత్తం

జర్నలిస్టుల పాత్ర సమాజ నిర్మాణంలో గొప్పది

చిక్కడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజనిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని సెంట్రల్ క్రైమ్‌స్టేషన్, చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీలు వెంకటేష్, ఎల్. రమేష్‌కుమార్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(టీఎస్‌జేయూ)ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు ప్రముఖ జర్నలిస్ట్ ఉదయ్‌భాస్కర్‌ను సన్మానించి మాట్లాడుతూ సమాజానికి సరైనదిశ చూపడం జర్నలిస్టుల ధర్మమన్నారు. వార్తల వేగంకన్నా వాటి నిజస్వరూపం ముఖ్యమన్నారు. టీఎస్‌జేయూ అధ్యక్షుడు పురుషోత్తం నారగోని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ నేతలు అనిల్‌కుమార్, వాసు, చంద్రమోహన్, ముఖేష్‌గౌడ్, అంజనేయులు, రియాజ్, విష్ణుమోహన్, చంద్రమౌళి, మహేందర్, వెంకటేష్, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వేషన్ల వ్యతిరేక కుట్రల వల్లే బీసీల వెనుకబాటు



మాట్లాడుతున్న దండి వెంకట్

చిక్కడపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల కాలంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కుట్రలు పన్నడం వల్లే దేశ జనాభాలో 60శాతం ఉన్న బీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో వెనుకబడి పోతున్నారని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ ఆరోపించారు. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జరుగుతున్న రాజకీయ శిక్షణా తరగతుల రెండోరోజైన ఆదివారం జరిగిన ప్రారంభ సమావేశంలో వెంకట్ మాట్లాడారు. రెండున్నర కోట్ల మంది తెలంగాణ బీసీ కులాల ప్రజలు స్వయంగౌరవ పోరాటంతో కేంద్రం మెడలు వంచి రిజర్వేషన్లు సాధించేవరకు ఐక్యపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిద్ది రాములు, తలారి ప్రవీణ్, శ్రీశైలం, వడ్ల సాయికృష్ణ, లత, అంజనేయులు, ఆనంద్, ప్రభు, భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తి

మేయర్ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన పనులు ● త్వరలో ప్రజలకు అందుబాటులోకి

ముషీరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో 5ఏళ్ల క్రితం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పనులు ఎట్టకేలకు పూర్తి అయ్యాయి. 2020 ఫిబ్రవరి 15న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, దివంగత మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు 200ల గజాల స్థలంలో మొదటి విడత రూ.19.10లక్షలతో చేపట్టిన కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు 4ఏళ్లుగా కేవలం స్లాబ్, గోడలకే పరిమితమయ్యాయి. నిధుల కొరత కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌లు జనవరి 9వ తేదీన భోలక్‌పూర్ ఇందిరానగర్‌లో పర్యటించినపుడు స్థానికులు నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులపై ఫిర్యాదు చేశారు. స్పందించిన మేయర్ స్థానిక జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేసి నిర్మాణ పనులు పూర్తిచేయాలని అందుకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని పేర్కొన్నారు. వెంటనే రూ.26లక్షలు సైతం మంజూరు చేశారు.



ఇందిరానగర్‌లో పూర్తైన అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్

నిర్మాణ పనులు పూర్తి

ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తిఅయ్యాయి. ఇప్పటికే కమ్యూనిటీహాల్‌కు కంపౌండ్‌వాల్, చుట్టూ గ్రిల్, రెండు బాత్రూమ్‌లు, టయిల్స్ భవనానికి రంగులు, డోర్‌లు, కమ్యూనిటీహాల్ చుట్టూ ఫ్లోరింగ్ పనులు పూర్తి అయ్యాయి. జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రత్యేక గది, వారి సామగ్రి పెట్టుకునేందుకు సౌకర్యంగా వసతులు కల్పించారు.

త్వరలో ప్రజలకు అందుబాటులోకి కమ్యూనిటీహాల్



దాదాపు కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు పూర్తిఅయ్యాయి. కేవలం విద్యుత్ వైరింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేసి స్థానిక ప్రజలకు కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి తీసుకువస్తాం.

- సన్నీ, జీహెచ్ఎంసీ డీఈ

ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేయడం వల్లే..



ఇందిరానగర్‌లో 2020లో శంకుస్థాపన చేసిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్‌తో పాటు జీహెచ్ఎంసీ ఈఈ, డీఈలకు ఫిర్యాదు చేశాం. కార్యాలయాల చుట్టూ పలు మార్లు తిరిగి నిధులు మంజూరు చేయించడం వల్లే కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి.

- నందగిరి నర్సింహ, ఇందిరానగర్ బస్తీ అధ్యక్షుడు

నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనుల్లో ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి. స్థానిక ప్రజలకు ఈ కమ్యూనిటీహాల్ అన్ని విధాలా ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నాం.

- ఎమ్మెల్యే ముఠాగోపాల్

హర్షకు ఓయూలో తిరిగి అడ్మిషన్

● బీసీ విద్యార్థి జేఏసీ పోరాట ఫలితం



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సస్పెండ్ చేసిన హర్షకు ఓయూ అధికారులు తిరిగి అడ్మిషన్ కల్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నిజాం కాలేజ్‌లో బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్) మూడో సంవత్సరం చదువుతున్న మిట్టపల్లి హర్ష ప్రిన్సిపాల్‌ను విద్యార్థి సమస్యలపై ప్రశ్నించినందుకు మూడు నెలలుగా సస్పెండ్ చేశారని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్ తెలిపారు. ఈ చర్యతో విద్యార్థి మానసిక, విద్యా భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడిందని, హర్ష తల్లిదండ్రులు పలుమార్లు ఓయూ వైస్ చాన్సలర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా స్పందించలేదని పేర్కొన్నారు. తమ సూచనతో హైకోర్టును ఆశ్రయించగా కోర్టు తీర్పు హర్షకు అనుకూలంగా వచ్చిందన్నారు. ఓయూ అధికారులు కోర్టు ఆదేశాల అమలులో ఆలస్యం చేయడంతో సమస్యను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లామన్నారు. కమిషన్ జోక్యంతో ఓయూ ఉన్నతాధికారులు హర్షకు షరతులు లేకుండా తిరిగి అడ్మిషన్, హాస్టల్ వసతి, అన్ని పరీక్షల రాసే హక్కు కల్పించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో హర్షకు మార్కుల విషయంలో లేదా విద్యా కార్యకలాపాల్లో వివక్షత చూపితే తీవ్రంగా స్పందిస్తామని స్వామి గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు గణేష్ గౌడ్, అరవింద్, శివ యాదవ్, శ్రవణ్, లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కవాడిగూడ ప్రకండ హుతాత్మ దివస్‌ను పురస్కరించుకుని ఆదివారం కవాడిగూడ సింగాడికుంటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, యువత పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ మహంకాళి జిల్లా కార్యదర్శి అనంత్‌జీ, ప్రాంత కో-కన్వీనర్ శ్రీకాంత్, వెదిరే రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి



పోటీల్లో గెలిచిన చిన్నారులతో జంపన

స్కూల్‌గేమ్స్ విజేతలకు సత్కారం

సికింద్రాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 69వ స్కూల్ గేమ్స్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ ప్రదర్శించిన చిన్నారులను కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ జంపన ప్రతాప్ ఘనంగా సత్కరించారు. జిల్లా స్థాయిలో జరిగిన రైటింగ్ పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థి ఎన్.ద్వారకామణితోపాటు కబడ్డీ తదితర పోటీల్లో గెలుపొందిన చిన్నారులను శాలువాలతో ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాలా ఏళ్ల నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. బోయినపల్లి ప్లేగ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో సాయిబాబా యాదవ్, కరణ్‌సింగ్, శివ, అరుణ్‌యాదవ్, పవన్ పాల్గొన్నారు.

ఉమామహేశ్వర వ్రతాలు

హైదర్‌నగర్: కూకట్‌పల్లిలోని వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం భక్తి పారవశ్యంతో కూడిన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, రంగారావు హాజరై సామూహిక ఉమామహేశ్వర వ్రతాలు, శివలింగ పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ దంపతులను ఘనంగా సన్మానించారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న లక్కరాజు నిర్మల

బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆంధ్రమహిళా సభ మామిడిపూడి రంగయ్య హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు, దంపతులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ లక్కరాజు నిర్మల 'విశ్వ నియమాలు- విశ్వ రహస్యాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తోటవర్తి గోపాలకృష్ణ, బ్రహ్మ గందం, నెమలికంటి కృష్ణమూర్తి, డా. కిరణ్‌కుమార్, డా.హర్షిత తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ మహాసభలకు ఏర్పాట్లు



వాల్ రైటింగ్ రాస్తున్న ఏఐఎస్‌ఎఫ్ బృందం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ ఆడిటోరియంలో ఈ నెల 25న నిర్వహించే ఏఐఎస్‌ఎఫ్ 25వ మహాసభలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నారు. అందులో భాగంగా ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కౌన్సిల్ బృందం ఇలా వాల్ రైటింగ్ రాస్తున్నారు.



అంబర్‌పేట బొడ్రాయి(నాభిశిల) ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డిలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా కావలి హనుమంతు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆయనను ప్రకటించి నియామక పత్రం అందజేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఉచిత హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి

తార్నాక : ఖుదిరాం మెమోరియల్ డయాబెటిక్ ట్రస్ట్, కందర్ డయాబెటిస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలో ఉచిత మెగా డయాబెటిక్ హెల్త్, ఒబేసిటీ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌ను కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డితో పాటు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, ఉపాధ్యక్షురాలు బండ కార్తీకా చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కందర్ డయాబెటిక్ సెంటర్ ఎండీ డాక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో ఫిజికల్ యాక్టివిటీస్ తగ్గి మెంటల్ టెన్షన్ ఎక్కువ అవుతుందని, దాంతో చాలామంది డయాబెటిస్ బారిన పడుతున్నారని అన్నారు. బ్యాలెన్స్ న్యూట్రిషన్, రెగ్యులర్ ఫిజికల్ యాక్టివిటీ, ఒత్తిడిని తగ్గించుకోవడం, వంటి జాగ్రత్తలు తీసుకుంటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చని సూచించారు. బీజేపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేశ్వర్ రెడ్డి, మేకల సారంగపాణి, వెంకటేశ్‌గౌడ్, పోచయ్య యాదవ్, ఉపేందర్‌యాదవ్ పాల్గొన్నారు.



పట్నం రవీంద్రబాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనాథ పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత నేపథ్యంలో పిల్లలకు దుప్పట్లను పట్నం రవీంద్రబాబు పంపిణీ చేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

రిజర్వేషన్ల సాధనకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమం

● బీసీ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ కోలా జనార్దన్

రాంనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిరంతర ఉద్యమాలు నిర్ణయించినట్లు బీసీ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ కోలా జనార్దన్ తెలిపారు. త్వరలో రాష్ట్ర కమిటీ సమావేశమై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం పంచాయతీల నుంచి పార్లమెంట్ వరకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కొన్ని దశాబ్దాలుగా అగ్రవర్ణాలే రాష్ట్రాన్ని పాలిస్తున్నాయని ఆరోపించారు.

బీసీలు జెండాలు మోసే కార్యకర్తలు గానే మిగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మహిళా రిజర్వేషన్లలో బీసీలకు సబ్‌కోటా కల్పించాలన్నారు. బీసీ ప్రజా సంఘాలతో బీసీ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.పురుషోత్తమ్ నియమించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ చెన్న రాములు, ప్రొఫెసర్ ఎం.రమణ, లక్ష్మీశ్రావణి, ప్రభాకర్, సుదర్శనాచారి, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన కారులో మంటలు

● మంటలను ఆర్పిన ఫైరింజన్



కారులో మంటలు చెలరేగుతున్న దృశ్యం

కవాడిగూడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో పార్కింగ్ చేసిన కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కారులో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పార్కు చేసిన టీఎస్ 09 జీడీ 1262 నెంబరు గల ఎలక్ట్రికల్ కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వెంటనే రెండు ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దోమలగూడ పోలీసులు, గాంధీనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని పోలీసులు పేర్కొన్నారు. నెల రోజులుగా ఈ వాహనం ఎన్టీఆర్ స్టేడియంలో పార్కు చేసి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సత్యానగర్‌బస్తీ కమిటీ ప్రమాణ స్వీకారం

నల్లకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ సత్యానగర్ బస్తీ కమిటీ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఎస్.ఇ.మహేందర్, ప్రధాన కార్యదర్శిగా జి.రాజేశ్వరరావు, కార్యదర్శిగా కె.క్రాంతికుమార్, కోశాధికారిగా తాలుకా రవిరాజ్, సంయుక్త కార్యదర్శిగా డి.శశిధర్ ప్రమాణ స్వీకారం చేశారు. బస్తీలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నూతన కమిటీ సభ్యులు పూలమాలలు వేశారు. అనంతరం స్థానిక ప్రజలు నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు శాలువాకప్పి సత్కరించి అభినందించారు. అధ్యక్షుడు ఎస్.ఇ.మహేందర్ మాట్లాడుతూ బస్తీలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

భక్తిని నింపిన హరికథాగానం

చిక్కడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన హరికథాగానం భక్తిని నింపింది. భక్తులను ఆకట్టుకునేలా హరికథా భాగవతార్ ఎస్ఎంవి రమణమూర్తి హరికథను వినిపించారు. ప్రతినెలా ఒకరోజు ప్రభుత్వ ఆదేశం ప్రకారం ఆలయంలో కళారూపాల ప్రదర్శన ఉంటుందని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు తెలిపారు.